### నేడు ఓయూలో 2కే రన్

ఉస్మానియా యూనివర్సిటీ, మార్చి 16: ఎస్ఎఫ్ఐ ఓయూ కమిటీ ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీ ఎన్‌సీసీ గేటు నుంచి ఆర్ట్స్ కళాశాల వరకు ఆదివారం ఉదయం ఆరున్నర గంటలకు 2కే రన్ నిర్వహించనున్నట్లు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎల్ మూర్తి తెలిపారు. దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆర్ట్స్ కళాశాల ఆవరణలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ ఓయూ కార్యదర్శి రవినాయక్‌తో కలిసి మూర్తి మాట్లాడుతూ భగత్ సింగ్ యువజన ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 17 నుంచి 23 వరకు హైదరాబాద్ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో వ్యాసరచన, క్రీడలు, కుస్తీ పోటీలను నిర్వహించనున్నట్లు చెప్పారు. ఓయూలో జరిగే రన్‌కు విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

### పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలి


నాలా పనులను పరిశీలిస్తున్న మెట్టుగూడ కార్పొరేటర్ సునీత

అడ్డగుట్ట, మార్చి 16 : పెండింగ్‌లో ఉన్న పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆయా విభాగాల అధికారులను మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరి సునీత ఆదేశించారు. డివిజన్ పరిధిలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను ఆమె అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... ఇప్పటికే నిధులు మంజూరైన పనులను త్వరగా ప్రారంభించి పూర్తి చేయాలన్నారు.

### అయోధ్య ఆలయ ప్రతిమల అందజేత


అయోధ్య ఆలయ ప్రతిమలను ఇంటింటా అందజేస్తున్న శ్రీనివాస్, ఉమేశ్, రాజు తదితరులు

బన్సీలాల్‌పేట్, మార్చి 16 : అయోధ్యలో నిర్మించిన రామాలయ ప్రతిమలను శనివారం బీజేపీ నాయకులు ఇంటింటికీ తిరిగి అందజేశారు. బీజేపీ నాయకుడు మిట్టపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో బన్సీలాల్‌పేట్ డివిజన్ అధ్యక్షుడు ఉమేశ్ ఖండేల్వాల్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఎస్.రాజు, కిన్, ఎ.శ్రీనివాస్, రవి తదితరులు న్యూబోయిగూడలోని పలువురు ప్రముఖుల నివాసాలకు వెళ్ళి వాటిని అందజేశారు.


లోక్‌సభ ఎన్నికల కోసం శనివారం మధ్యాహ్నం ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది.. దీంతో ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో సికింద్రాబాద్ పరిధిలో గోడలపై ఉన్న రాతలను చెరిపివేస్తున్నారు జీహెచ్ఎంసీ సిబ్బంది.


పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మల్కాజిగిరిలో నిర్వహించిన రోడ్‌షోకు హాజరైన ప్రధాని నరేంద్ర మోదీని సికింద్రాబాద్ మహంకాళి జిల్లా బీజేపీ కార్యదర్శి మల్లికంటి వీరన్న మర్యాద పూర్వకంగా కలిశారు.
–ఉస్మానియా యూనివర్సిటీ, మార్చి 16:

# అరెస్ట్..అప్రజాస్వామికం

- కోర్టులో కేసు నడుస్తుండగా కవితను ఎలా అరెస్టు చేస్తారు
- కేంద్రం చేతిలో కీలు బొమ్మలుగా దర్యాప్తు సంస్థలు
- వెల్లువెత్తిన నిరసనలు
- బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్


కార్ఖానాలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నినాదాలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకురాలు నివేదిత, బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి, పార్టీ కార్యకర్తలు, నాయకులు

కంటోన్మెంట్/ఉస్మానియా యూనివర్సిటీ/సికింద్రాబాద్/అడ్డగుట/ అమీర్‌పేట్/మారేడ్‌పల్లి, మార్చి 16: బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అరెస్టును వ్యతిరేకిస్తూ కంటోన్మెంట్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గజ్జెల నాగేష్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకురాలు నివేదిత ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వ్యాప్త పిలుపు మేరకు పార్టీ శ్రేణులతో కలిసి పెద్ద ఎత్తున నల్ల జెండాలతో నిరసన కార్యక్రమం చేపట్టారు. కంటోన్మెంట్ డైమండ్ పాయింట్ చౌరస్తాలో గజ్జెల నాగేష్ నేతృత్వంలో మానవహారం నిర్వహించి నల్లజెండాలతో నిరసన వ్యక్తం చేసి కేంద్ర ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు.
అనంతరం గజ్జెల నాగేష్ మాట్లాడుతూ.. కవిత అరెస్టు అప్రజాస్వామికం, అక్రమం, అనైతికమని తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. న్యాయపరంగా పోరాడతాం అని పేర్కొన్నారు. మాకు పోరాటాలు కొత్తకాదు. మా పార్టీ పుట్టిందే ఉద్యమంలో అని స్పష్టం చేశారు. అదేవిధంగా కవిత అరెస్టును నిరసిస్తూ సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గం కార్ఖానాలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి గులాబీశ్రేణులు నిరసన తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి, మాజీ సభ్యులు అనితా ప్రభాకర్, నళిని కిరణ్, పాండు యాదవ్, భాగ్యశ్రీ శ్యామ్‌కుమార్, లోకనాథం, మార్కెట్ మాజీ చైర్మన్ టీఎన్ శ్రీనివాస్‌తో పాటు పలు వార్డుల బీఆర్ఎస్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, యువ నాయకులు, కార్యకర్తలు, ఉద్యమకారులు, మహిళా నేతలు పాల్గొన్నారు.

**హోరెత్తిన నిరసనలు**

భారత జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత అరెస్టుకు వ్యతిరేకంగా వివిధ ప్రాంతాల్లో నిరసనలు హోరెత్తాయి. ఉస్మానియా, యూనివర్సిటీ, తార్నాక, బౌద్ధనగర్ తదితర ప్రాంతాల్లో బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళన చేపట్టారు. బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్, ఉపాధ్యక్షులు తుంగ బాలు, కోతి విజయ్, జంగం అవినాశ్, రఘురాం, నాయకులు బండారి వీర బాబు, చటారి దశరథ్, వేల్పుకొండ వెంకటేశ్, జంగయ్య, హరిబాబు, కాటం శివ, రమేశ్‌గౌడ్, వల్లమల్ల సూర్యప్రకాశ్, నాగేందర్, మహేశ్, సురేందర్, మహిపాల్, రవీందర్, నరేశ్, ప్రకాశ్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.
- తార్నాక డివిజన్ మాజీ కార్పొరేటర్ ఆలకుంట సరస్వతీహరి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు మాణికేశ్వరీనగర్ ప్రధాన రహదారిపై బైఠాయించి, రాస్తారోకో నిర్వహించారు.
- బౌద్ధనగర్ కార్పొరేటర్ కంది శైలజ ఆధ్వర్యంలో వారాసిగూడ చౌరస్తాలో బీఆర్ఎస్ కార్యకర్తలు ఆందోళన చేపట్టారు.

**ఎమ్మెల్సీ కవిత అక్రమ అరెస్టును ఖండిస్తున్నాం**

ఎమ్మెల్సీ కవిత అక్రమ అరెస్టును నిరసిస్తూ సికింద్రాబాద్ నియోజకవర్గ పరిధిలో బీఆర్ఎస్ శ్రేణులు నిరసన కార్యక్రమాలు చేపట్టారు.శనివారం సికింద్రాబాద్ నియోజకవర్గ పరిధిలోని అడ్డగుట్ట,సీతాఫల్‌మండి, తార్నాక,బౌద్ధనగర్,మెట్టుగూడలకు చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్లు,నాయకులు,కార్యకర్తలు పలు నిరసన కార్యక్రమాలను నిర్వహించారు. కార్పొరేటర్ హేమ ఆధ్వర్యంలో సీతాఫల్‌మండి బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం నుంచి కేంద్ర ప్రభుత్వానికి , ఈడీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ పాదయాత్రగా వెళ్లి సీతాఫల్‌మండి చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించారు.

**కక్ష సాధింపు చర్యలే...**

కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే ఎమ్మెల్సీ కవిత అప్రజాస్వామి పద్ధతుల్లో అరెస్ట్ చేశారంటూ సనత్‌నగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ శ్రేణులు భగ్గుమన్నాయి. కవిత అక్రమ అరెస్ట్‌కు నిరసనగా బీఆర్ఎస్ అధిష్ఠానం ఇచ్చిన పిలుపు మేరకు సనత్‌నగర్ నియోజకవర్గం పరిధిలోని బేగంపేట్, రాంగోపాల్‌పేట్, అమీర్‌పేట్ డివిజన్లలో బీఆర్ఎస్ నాయకులు ప్రధాన కూడళ్లలో నిరసన ప్రదర్శనకు దిగారు. బేగంపేట్‌కు చెందిన శ్రీహరి, ఆరీఫ్, నరేష్, రాంగోపాల్‌పేట్ డివిజన్‌కు చెందిన సత్యనారాయణ, మల్లేష్, సతీష్ తదితరులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేసి ఆయా పీఎస్‌లకు తరలించారు.

**ఎంతవరకైనా పోరాటం చేస్తాం**

**మాజీ కార్పొరేషన్ చైర్మన్ మన్నె క్రిశాంక్**

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అరెస్టు అప్రజాస్వామికం అని, న్యాయం కోసం ఎంతవరకైనా పోరాటం చేస్తామని తెలంగాణ రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ మన్నె క్రిశాంక్ అన్నారు. కవిత అక్రమ అరెస్టుకు వ్యతిరేకంగా జూబ్లీబస్టాండ్ చౌరస్తాలో నల్ల జెండాలు పట్టుకొని బీజేపీకి–మోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేషన్ చైర్మన్ మన్నె క్రిశాంక్ మాట్లాడుతూ...ప్రతిపక్ష పార్టీలను అణిచివేసేందుకు కేంద్రంలోని బీజేపీ సర్కార్ సీబీఐ, ఈడీ సంస్థను వాడుకుంటుందన్నారు. తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిని రాజకీయంగా ఎదుర్కోలేకనే బీజేపీ–కాంగ్రెస్ కేంద్ర సంస్థలను అడ్డుపెట్టుకొని ఇబ్బందులకు గురిచేస్తుందని తెలిపారు.


డైమండ్ పాయింట్ చౌరస్తాలో ఎమ్మెల్సీ కవిత అరెస్ట్‌కు నిరసనగా ఆందోళన చేస్తున్న రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గజ్జెల నాగేష్, పార్టీ నాయకులు

**కోర్టులో కేసు నడుస్తుండగా..అరెస్టా..!**

సుప్రీంకోర్టులో కేసు నడుస్తుండగా అక్రమంగా ఎమ్మెల్సీ కవితను అరెస్టు చేయడం అనైతికమని అడ్డగుట్ట కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మీ శ్రీనివాస్ అన్నారు. ఎమ్మెల్సీ కవిత అరెస్టు నేపథ్యంలో అడ్డగుట్ట కార్పొరేటర్ ఆధ్వర్యంలో పార్టీశ్రేణులు తుకారాంగేట్ రియో పాయింట్ హోటల్ నుంచి ఇందిరాగాంధీ విగ్రహం వరకు ప్లకార్డులు పట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు లింగాని శ్రీనివాస్, సత్తయ్య గౌడ్, శ్రీనివాస్ గౌడ్, వడ్డెర ఎల్లయ్య, పొన్నాల రాజు, అమర్, నర్సింగ్, అయోధ్య, దేవయ్య, వడ్లూరి రవి, వసంత, రజిని, విమల, భాగ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.

**అమీర్‌పేట్‌లో..**

కవిత అరెస్ట్‌కు నిరసనగా అమీర్‌పేట్ డివిజన్‌లో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు దాడి ప్రవీణ్‌రెడ్డి ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ ప్రదర్శనలో బీఆర్ఎస్ నాయకులు కూతురు నర్సింహ, ప్రభుగౌడ్, జోగిందర్‌సింగ్, హరిసింగ్‌జాదవ్ తదితరులు పాల్గొన్నారు.


సికింద్రాబాద్: సీతాఫల్‌మండి చౌరస్తాలో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ కార్పొరేటర్ హేమ,నాయకులు, డివిజన్ అధ్యక్షులు


ఉస్మానియా వర్సిటీ: ప్రధాని నరేంద్రమోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్వీ నాయకులు


మాణికేశ్వరీనగర్ వద్ద రోడ్డుపై రాస్తారోకో చేస్తున్న మాజీ కార్పొరేటర్ ఆలకుంట సరస్వతీహరి తదితరులు


వారాసిగూడ చౌరస్తాలో ఆందోళన చేస్తున్న కార్పొరేటర్ కంది శైలజ

**బీజేపీ చేతిలో కీలు బొమ్మగా ఈడీ**

అడ్డగుట్ట, మార్చి 16 : ఎమ్మెల్సీ కవితను అక్రమంగా అరెస్టు చేసిన ఈడీ సుప్రీంకోర్టులో సమాధానం చెప్పుకోవాల్సి ఉంటుందని బీఆర్ఎస్ నగర సంయుక్త కార్యదర్శి గుండవేణి రాజేష్ గౌడ్(పెద్దన్న) శనివారం ఓ ప్రకటనలో తెలియజేశారు. కవిత అరెస్టును ఆయన ఖండించారు. కేంద్ర దర్యాప్తు సంస్థలు బీజేపీ చేతిలో కీలుబొమ్మలుగా మారాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టులో కేసు నడుస్తుండగా ఎలా అరెస్టు చేస్తారని ఆయన ప్రశ్నించారు.


అడ్డగుట:తుకారాంగేట్‌లో ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న అడ్డగుట్ట కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మీ శ్రీనివాస్, పార్టీ నాయకులు


పోలీసుల అదుపులో బీఆర్ఎస్ నాయకులు శ్రీహరి తదితరులు


అమీర్‌పేట్: రాంగోపాల్‌పేట్‌లో అత్తెల్లి శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో..


ఉస్మానియా యూనివర్సిటీ: లాలాపేటలో ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు


అమీర్‌పేట్‌లో దాడి ప్రవీణ్‌రెడ్డి ఆధ్వర్యంలో..

# కంటోన్మెంట్ బరిలో ఉంటాను

- కార్యకర్తల అభీష్టం మేరకు బరిలో ఉంటానని నివేదిత స్పష్టం
- లాస్యనందిత మృతికి గులాబీ శ్రేణుల సంతాపం
- ఉపఎన్నిక ఏకగ్రీవానికి సహకరించాలని రాజకీయ పార్టీలకు విజ్ఞప్తి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న దివంగత ఎమ్మెల్యే లాస్యనందిత సోదరి బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకురాలు నివేదిత

కంటోన్మెంట్, మార్చి 16: గులాబీ నేతలు, కార్యకర్తల అభీష్టం మేరకు.. సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గం ఉప ఎన్నికల బరిలో ఉంటానని దివంగత ఎమ్మెల్యే లాస్యనందిత సోదరి, బీఆర్ఎస్ సీనియర్ నాయకురాలు నివేదిత స్పష్టం చేశారు. కంటోన్మెంట్ నియోజకవర్గ ఉప ఎన్నిక ఏకగ్రీవం కావడానికి రాజకీయ పార్టీలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. దివంగత ఎమ్మెల్యే లాస్యనందిత ఆశయసాధన కోసం కృషి చేస్తానని చెప్పారు. ఈ మేరకు శనివారం సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తల ఆత్మీయ సమావేశం కార్ఖానాలోని క్యాంపు కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశంలో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి, మాజీ సభ్యులు అనితా ప్రభాకర్, నళిని కిరణ్, పాండు యాదవ్, భాగ్యశ్రీ శ్యాంకుమార్, లోకనాథంతో పాటు మార్కెట్ మాజీ చైర్మన్ టీఎన్ శ్రీనివాస్, పలు వార్డుల బీఆర్ఎస్ అధ్యక్షులు, పలువురు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, యువ నాయకులు, కార్యకర్తలు, మహిళా నేతలు, ఉద్యమ కారులు, స్వర్గీయ సాయన్న అభిమానులు, దివంగత ఎమ్మెల్యే లాస్యనందిత అభిమానులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు. ముందుగా దివంగత ఎమ్మెల్యే లాస్య నందిత మృతికి సంతాపం తెలియజేస్తూ గులాబీశ్రేణులు 2 నిమిషాల పాటు మౌనం పాటించారు. కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జక్కుల మహేశ్వర్ రెడ్డి ఈ సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. అనంతరం బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు తమ అభిప్రాయాన్ని తెలియజేశారు. లాస్య నందిత హఠాన్మరణంపై కన్నీరుమున్నీరయ్యారు. లాస్యనందిత సోదరి, పార్టీ నాయకురాలు నివేదిత కంటోన్మెంట్ నియోజకవర్గ ఉప ఎన్నికల బరిలో ఉండాల్సిందేనని తేల్చిచెప్పారు. లాస్యనందిత కంటే రెట్టింపు మెజార్టీతో నివేదితను గెలిపించుకుంటామన్నారు. బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలందరి అభిప్రాయాలు, సూచనల అనంతరం నివేదిత మాట్లాడారు. గులాబీ శ్రేణుల అభిప్రాయం మేరకు కంటోన్మెంట్ ఉప ఎన్నికల బరిలో ఉంటానని స్పష్టం చేశారు. త్వరలోనే పార్టీ హైకమాండ్‌ను కలుస్తామన్నారు. కంటోన్మెంట్ ఉప ఎన్నిక ఏకగ్రీవం కావడానికి ఇతర రాజకీయ పార్టీలు కూడా సహకరించాలన్నారు.



### విద్యార్థులకు బహుమతులు

సైన్స్ డే వేడుకల్లో భాగంగా ఇటీవల సనత్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో జరిగిన ఆర్.బి.నారాయణ స్మారక సైన్స్, క్రీడ, సాంస్కృతిక పోటీల్లో సత్తా చాటిన విద్యార్థులకు బహుమతుల ప్రదానం శనివారం జరిగింది. సనత్‌నగర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆర్.బి.నరేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సనత్‌నగర్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి డాక్టర్ కోటా నీలిమ పాల్గొని విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతుల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు.
– అమీర్‌పేట్, మార్చి 16

### బీజేపీ ప్రభుత్వాన్ని గద్దెదింపాలి : ఏఐవైఎఫ్

హిమాయత్‌నగర్: దేశ సంపదను కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తున్న ప్రధాని మోదీ ప్రభుత్వాన్ని గద్దెదింపేందుకు పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర యువతకు పిలుపు నిచ్చారు. భగత్‌సింగ్, రాజ్ గురు, సుఖ్‌దేవుల 91వ వర్ధంతి సందర్భంగా శనివారం హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్ వద్ద ప్రచార హోర్డింగ్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భగత్‌సింగ్ జీవితం యువతకు స్ఫూర్తిదాయకమని,వీరి వర్ధంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు.




### ఘనంగా గ్రాడ్యుయేషన్ డే ..

తమ యూకేజీని విజయవంతంగా పూర్తి చేసుకుని ఫస్ట్ క్లాస్‌లోకి వెళ్తున్న చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డేను అమీర్‌పేట్ సిస్టర్ నివేదిత స్కూల్‌లో ఘనంగా జరిగింది. స్కూల్ చైర్మన్ డాక్టర్ పొల్సాని సుధాకర్‌రావు, కార్యదర్శి పి.రమాదేవిలు చిన్నారులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ టి.లలితకుమారి, కరస్పాండెంట్ ఎం.హరిహర ప్రసాద్, ప్లే స్కూల్ కోఆర్డినేటర్ ఎస్.సునీత పాల్గొన్నారు. – అమీర్‌పేట్